# బల్లకట్టూ బడిపంతులూ

నాకేవిటో మా ఊరిబయట కాలవలో అటూ ఇటూ తారట్లాడే బల్లకట్టుని చూసినప్పుడల్లా చిన్నప్పుడు నాకు పాఠం చెప్పిన మా పంతులుగారు జ్ఞాపకం వస్తారు "ఏం?.... ఎందుకు వస్తారు?... దానికీ ఆయనకీ సంబంధం ఏవిటి?..." అని కనక ఎవరేనా డబాయిస్తే మాత్రం నేనేం చెప్పలేనుకాని, నాకెందుకో అలా అనిపిస్తుంది. ఈ బల్లకట్టుకి ఆ బడిపంతులికీ అవి నా భావసంబంధం ఏదో ఉందని.

పాతికేళ్ళనుంచి చూస్తున్నాను. లోకం అంతా శరవేగంతో సాగిపోతోంది. మహావేగంతో మారిపోతోంది. కాని బల్లకట్టులో కాని, బడిపంతులులో కాని వీసమెత్తయినా మార్పు రాలేదు. నావలు-పడవలు-లాంచీలు-స్టీమ్‌బోటులు ఇవన్నీ హంగులు మార్చి రంగు పిరాయించి ఝామ్మంటూ జలవిహారం చేసేస్తున్నాయి. బల్లకట్టుమాత్రం పూర్వంలాగే ఆ బల్లపరుపు కర్రల కూర్పుతో, అదే ఇనప రేకుల

తాపడంతో నలుపలకలుగా నమ్రతగా ఉండిపోయింది, రాత్రిళ్ళు గట్టుమీదవున్న ఏ చెట్టుకో కట్టెయ్యడానికి వీలుగా, అతికించేసిన ఆ ఇనపరింగూ దానికి ముడివేయబడ్డ ఆ పెద్ద ఇనపగొలుసూ, ఎప్పుడూ నీళ్ళలో నానుతూండడంవల్ల ఓ పక్క బాగా చీకిపోయి మెత్తగా పీచుగా మారిపోయి. బల్లకట్టుని తొయ్యడానికి ఉపయోగపడుతూన్న వెదురుగడా—ఆ గడ ఇంకో చివరని గట్టిగా గుండెకి ఆన్చి బల్లకట్టునితోసే బక్కచిక్కిన వీరడు—వీటిలో ఏ మార్పూ రాలేదు పాతికేళ్ళ క్రితం యెలా ఉన్నాయో ఇప్పుడూ అలాగే ఉన్నాయి.

పాపం!

మా బడిపంతులూ అంతే!

పెంటిగాడు పెంటయ్య అయి లాండ్ పెండ్లండ్ కూడా అవుతున్నాడా! పెసరపుణుకుల నరహరిశెట్టి పెద్ద వ్యాపారస్థుడై బ్లాక్ మార్కెటీర్ల ఎసోసియేషన్కి గౌరవాధ్యక్షుడు అయ్యాడా?...నిన్న మొన్నటిదాకా ఊళ్ళోవాళ్ళ జేబులూ వీళ్ళ జేబులూ కొట్టేసిన సీతిగాడు మహా నీతిమంతుడై అందరికీ హితబోధచేసే రాజకీయవేత్త కూడా అయ్యాడు కదా?... ఇలా అందరూ తెలివిగా బోలెడేసి బాగుపడి పోతున్నా. ఆ బాగుపడడమేమిటో తనహక్కు కాదన్నటు తను మాత్రం అలాగేవుండిపోయారు మాపంతులుగారు. నెత్తిమీద ఆ చిన్న పిలకా, మెళ్ళో రుద్రాక్షమాలా, దారంతో ఓ వేపు చెవికి తగిలింపబడ్డ కళ్ళజోడూ, చిరిగిపోయిన ఖద్దరుపంచే చొక్కా; కైరుజోడూ వీటిలో మాత్రం మార్పేం రాలేదు.

ఈ మధ్యన వస్తూన్న నావలూ, లాంచీలూ ఎన్ని

హొయలు పోతున్నాయి? ఓ రకరకాల రంగుల అలంకరణలా, ఓ అందమైన ఆసన నిర్మాణాలా, ఎక్కువ కిరాయి ఇచ్చుకోగలిగిన వాళ్ళకి వీలుగా ఓ వొంపుసొంపుల సదుపాయాలా?.... ఓ....మిరాచిత్రం వచ్చినట్లు- వెన్నెల విసినికర్రలలాగ వెల్లి విరిసి పోతున్నాయి-అవునా?....బల్లకట్టుమాత్రం ఈ కొత్త ఫేషన్ల ఏమీ ఫులుముకోకుండ పూర్వంలాగే వుండిపోయింది. అది అప్పుడూ ఇప్పుడూ ఎప్పుడూ కూడా సాదాగా, నిరాడంబరంగా బల్ల పరుపుగానే వుంది. బడిపంతులు జీవితంలాగా, సాంఘిక సమానత్వంలాగాను. వేగంలో కూడా బల్లకట్టు పూర్వంలాగే వుంది. రోజుకో కొత్తలాంచీ, పదిహేను, ఇరవై, ఇరవై అయిదు మైళ్ళ వేగంతో హోరాహోరీగా వచ్చేస్తూంటే చూస్తూ ఊరుకుందేగాని తనెప్పుడూ ఏలాంచీతోనూ పరుగు పందెం వెయ్యలేదు. ఏ పడవతోనూ పంతం పెట్టుకోలేదు. తనేమో - తనగోడవేమో అంతే ఇంకాపోతే, మూర్ఖుని కోపంలాగ గట్లని కోసేసే ఎత్తయిన కెరటాల్ని సృష్టిస్తూ శరవేగంతో వచ్చిపడే లాంచీని చూసి ఓ పక్కకి ఒదిగి తప్పుకొనేదికూడా. అలా దానికి దారి ఇచ్చేసి అది వెళ్ళిపోయిన తర్వాత తిరిగి యథాపూర్వం తన కార్యక్రమాన్ని ఆరంభించేది.

బడిపంతులూ అంతే!

అందని పరుగులికి ఆయన ఎప్పుడూ పోలేదు. తాపీ అయిన జీవితం సక్రమమైన నడవడే ఆయన ఎప్పుడూ ఇనస్పెక్టరుకాని, డి. ఇ. ఓ. కాని స్కూలు కమిటీ ప్రెసిడెంటుకాని ఆయన విషయాన్నీ విలువనీ తెలుసుకోకుండా తాడియెత్తున

లేస్తే లేచుకాక! ... అనాగరికంగా అనరాని మాటలంటే అనుగాక! .... తను మాత్రం నిండుకుండే! ...

తనేమో - తనగోడవేమో—

అసలు వేగం కొంత అయితే దాన్ని అంతచేసుకోగల అవకాశం ఒక్క బల్లకట్టుకి తప్ప తక్కిన పడవలకి లాంచీలకీ అన్నింటికీ వుంది. ఎంత కష్టమైన పనినైనా కనురెప్పపాటులో సాధించే సర్వశక్తిమంతమైన డబ్బుమూటలాగ ఎంతవేగాన్నయినా ఒక్కక్షణంలో సృష్టించగల యింజను సదుపాయం లాంచీకివుంటే గొప్పవాడి రికమండేషనులాగ, వాయుదేవుడి సహాయంతో తెరచాపచాటుని లేని బలాన్ని పుంజుకొని డాబుగా ఝామ్మంటూ పైపైకి వెళ్ళిపోయే అవకాశం పడవకి వుంది. కాని పాపం బల్లకట్టుకి ఈ రెండూ లేవు. బడి పంతులులాగే అదికూడా యితర సహాయాలేం లేకుండా. స్వశక్తిమీద కేవలం స్వశక్తిమీదే కాలం గడుపుకుంటూ రావాలి.

"పోనీ-అలాగే-యితరుల సహాయం ఏమీ లేకుండా పూర్తిగా స్వంతశక్తిమీదే కాలం గడుపుదాం - మనలో వున్న బలమూ - బల్లకట్టూ బడిపంతులూ నిలబడదాం అనుకుంటే, అందుకు కాలమూ పరిస్థితులూ కలిసి రావడం లేదు.

చిరకాలంగా ఘనీభవించి పోయిన తరగతి గోడలు లాగ స్థాణువులుగా నిలబడిపోయిన ఆ కాలవగట్ల మధ్యనే ఎంతో కాలంగా తారట్లాడడంవల్ల ఎంతో అలసిపోయింది బల్లకట్టు - చాలీచాలని జీతంతో మొదుగూ బొదుగూ లేని జీవితాన్ని సర్దుకోలేక స్రవించే బడిపంతులు కన్నీటిదారలాగ

ఎల్లప్పుడూ ప్రవహించే ఆ కాలవనీటిలో నానినాని చీకి పోయింది బల్లకట్టు. దానికితోడు స్కూలు మేనేజరు, ఇనస్పెక్టరు, ఊళ్ళో మోతుబరులు - వీళ్ళ హృదయాల్లాగ రేవులో అక్కడక్కడ వున్న పెద్ద పెద్ద బండరాళ్ళు తగిలి బల్లకట్టు శరీరం చిల్లులు పడుతోంది.

రానురాను శిథిలావస్థలోకి వచ్చేసి యిలా తరుచు గాయాలకి గురి అవుతున్న తనని పీచుతోటీ పాతగుడ్డపీలికల తోటీ కప్పడానికి వ్యర్థ ప్రయత్నాలు చేసే ఏరడిని చూస్తే బల్లకట్టు గుండెనిండా నీళ్లు నిండేవి.

పాపం ?

ఇంట్లో గంపెడు సంసారం - ఏటా చూలింతగానో బాలింతగానో వుండే భార్య. నెత్తిమీద పెద్దబరువు. పైన నా సంరక్షణ ఒకటి. పోనీ ఆదాయం చూద్దామా అంటే బడిపంతులు జీతంలాగ అన్నికోతలూ పోగా, అరసగానికి కూడా రాదు ఊళ్ళో యింటింటికీ వసూలు కావలసిన కుంచెడేసి ధాన్యంలోనూ యెంతపోల్లో యెంతగట్టో ఏడాది చివరకి కాని తెలియదుకదా? .... పెద్దకాపందుల్నీ మోతుబరుల్నీ అడగడానికే వీలులేదు. వాళ్ళిస్తే పుచ్చుకోవాలి - లేకపోతే నోరు మూసుకుని ఊరుకోవాలి.

పోనీ రేవుదాటే పొరుగూరు పెద్దమనుష్యుల దగ్గర పైస పైస చొప్పున చేసే వసూళ్ళు ఏవైనా ఘనంగా వుంటాయా అంటే, అవీ అంతంత మాత్రమే!

ఓ ఇస్త్రీమడత 'పది రూపాయలకి చిల్లరుందా?'

అని ఇకిలిస్తే. యింకో జరీకండువా 'యిస్తాంలేవోయ్ ముష్టి పైన' అంటూ సకిలిస్తుంది.

ఇంక అలాంటప్పుడు వీరడు యింట్లో బడిపంతులు గృహాంలోలాగ నెలకో డజను శనివారాలూ, అర డజను ఏకాదశిలూ కాక మరేవిటి? .... యింట్లోవుంటే పిల్లల ఆకలి ఏడుపులు ఎక్కడ వినాల్సివస్తుందో అని తెల్లార కుండానే తన దగ్గరకొచ్చేసి కళవళపడుతూన్న ముఖాన్ని తనకి కనబడనీయకుండా అటు తిరిగి గెడవేసే వీరణ్ణి తలుచుకొన్నకొద్దీ కడుపు తరుక్కుపోతుంది బల్లకట్టుకి. అతని బాధలకితోడు చివికిపోయి చిల్లులడుతూన్న తను ఒహాటి!

అర్ధణాకూడా యివ్వని అలగాజనంఅంతా వీరడు మొత్తుకుంటున్నా వినిపించుకోకుండా ఏకంగా ఎక్కేసి కూచున్నప్పుడు బక్కచేతుల్తో వీరడు గెడని నొక్కి పడుతూ వుంటే. మహాపాప లావున్న ఆ మనుష్యుల బరువుతో ఒళ్ళు కంపరం ఎత్తి ఎన్నిమాట్లో నీళ్ళల్లో మునిగి 'హరీ' మందా అనుకుంది బల్లకట్టు.

ఈ రకంగానే నా ప్రతిమాటూ పీచుతోటి గుడ్డ పీలికలతోటీ తనకి సంరక్షణ చేసేభారం వీరడకి తప్పేతుంది అనుకుంది కాని ఆ తర్వాత వాడికి మాత్రం తిండికూడా ఉండక పిల్లలతో మాడిపోతాడనే ఆలోచన రావడంతో ఆ ప్రయత్నం మానేసి, బరువుగా బడిపంతులులా భారంగా జీవితాన్ని ఈడ్చేది.

బల్లకట్టులాగే బడిపంతులు బ్రతుకులో కూడా లక్ష ఒడిదుడుకులూ సవా లక్ష నిస్సంపత్తులూను.

తలకుమించిన అప్పులతో అసలే ఒంగిపోయిన పంతులు తల, స్కూలు మేనేజరు బెదరింపుల తోటీ, ఇనస్పెక్టర్ల విదిలింపులతోటీ మరీ ఒంగిపోసాగింది. కౌలు కదపాల దగ్గిర్నుంచి దస్తావేజు దాకా ఊళ్ళోవున్న అన్ని కాగితాలూ పంతులుచేత రాయించేవారే కాని, యెర్రని ఏగాణి ఆయన చేతిలో పెట్టినవాళ్ళెవ్వరూ లేరు స్కూల్లో అధికారుల అర్థంలేని అధార్టీలకితోడు ఇంట్లో నానాటికీ తీవ్రరూపం తాలుస్తూన్న ఆర్థిక సమస్య కూడా ఎక్కువై ఆయనుండే పాకలాగే ఆయన హృదయం కూడా చీకి చిల్లులు పడసాగింది. ఆయన వేదనకంటే, ఆ వేదనని కప్పి పుచ్చుకోవడానికి ఆయనపడే పాట్లు చూస్తేనే యెక్కువ జాలి వేస్తుంది.

అయితే —

ఈ బాధలనుంచీ బరువు బాధ్యతలనుంచీ తప్పించుకొని కొన్నాళ్లు తాపీగా ఊపిరి పీల్చుకొనే అవకాశం, వేసవి కాలంలో బడిపంతులుతోపాటు బల్లకట్టుకికూడా లభించేది. కాలవలు కట్టేసిన ఆ నెల్లాళ్ళపాటూ ఆనకట్టకి దగ్గర్లో వున్న 'మెయిన్ కెనాల్'లో విశ్రాంతి తీసుకొనే బల్లకట్టు రాబోయే పది పదకొండు నెలలోనూ మోయబోయే భారమైన జీవితానికి కావలసిన శక్తినీ, స్థయిర్యాన్ని ఇక్కడ పుంజుకొంటోందా అన్నట్లు ఉండేది.

బడిపంతులు కూడా ఈ వేసవి శలవలు నాలుగు రోజులూ తన బడిపంతులు అవస్థలనుంచి బైటకి వెళ్ళి, ఇంకో పది నెలలపాటు తిరిగి జీవిత చదరంగంలో పణంగా ఒడ్డవలసిన

మనస్సుకి శాంతినీ, శరీరానికి విశ్రాంతినీ సంపాదించుకొని వచ్చారా అన్నట్లు ఉండేవారు.

చిత్రం ఏమిటంటే తాము పడుతూన్న ఈ బాధలేవీ యిటు బల్లకట్టుకి కాని అటు బడిపంతులికి కాని భారంగానూ కనిపించేవి కావు. అలా కాకపోవడానికి ఓ కారణం ఉంది. ఏమంటే ఆ ఇద్దరికీ అంత వేదనామయ అంధకారంలోనూ ఒక వెలుగు కిరణం. తృప్తితో కూడిన ఓ వోదార్పూ ఎప్పుడూ ఉండేవి. తాము మాత్రం యిక్కడే ఉండిపోయినా ఈ తరగతి గట్టు మీంచి ఆ తరగతి గట్టుమీదకి తాము చేర్చి ఒడ్డు దాటించిన వ్యక్తులెందరో పైపైకిపోయి మంచి మంచి స్థానాల్లో ఉండడం యెంతో సంతృప్తినీ మరెంతో సంతోషాన్నీ యిచ్చేది.

ఒకొక్కసారి ఏ పెద్ద ఆఫీసరో కారు ఆపి అందులో పంతుల్ని ఎక్కించుకుని యింటికి తీసుకువెళ్ళి పళ్ళూ తాంబూలాలూ యిచ్చి "చిన్నప్పటి మా మేష్టారు నమస్కారం చెయ్యండి" అని భార్యచేతా పిల్లలచేతా దణ్ణం పెట్టిస్తే ఆయనికి సంతోషంతో కళ్ళు రెండూ చెరువులయ్యేవి.

ఆ తర్వాత వారం పది రోజులదాకా కనిపించిన వాళ్ళందరితోటి "ఫలానా ఆఫీసరు ఎవరో తెలుసా? ... నా విద్యార్థోయ్ నేను చెవులునులిపి పాఠం చెప్పిన కుర్రాడు" అంటూ చెబుతూ, చెప్పినవాళ్ళకే చెబుతున్నాం అనేది గమనించకుండా కళ్ళనుంచి చెంపల మీదుగా కారుతూలు సంతోషాన్ని కండువాతో ఒత్తుకుంటూ గర్వంగా అడుగున్న వేసుకుంటూ వెళ్తారు.

ఈ బల్లకట్టు వల్లా బడిపంతులు వల్లా లబ్ది పొందని వాళ్ళంటూ ఆ ఊళ్ళో ఎవ్వరూ లేరు కానయితే "ఆ రోజున అలా రేవుదాటి వెళ్ళాం కనకే" ... "ఆనాడు పంతులు నన్ను బెంచీ ఎక్కించి శిక్షించారు కనకే" ... అంటూ కృతజ్ఞతని చూపించేవాళ్ళు మాత్రం ఏ కొద్దిమందో!...

తక్కినవాళ్ళంతా ఎన్నికల తర్వాత తమనిగెలిపించిన ప్రజల్ని మరిచిపోయే రాజకీయ నాయకులే... వాళ్ళ వాళ్ళ పనులు అయిపోయాక బల్లకట్టు సంగతినీ బడిపంతులు దీనావస్థనీ పట్టించుకోనేవాళ్ళు ఒక్కళ్ళంటే ఒట్టు.

అందుకని బల్లకట్టూ బాధపడదు.

"చూశావా?" అని బడిపంతులూ నొచ్చుకోరు.

తామేమో - తమ విధియేమో -

అంతే -

చీకిపోయి చిల్లులుపడినా పూర్వంలాగే ఇప్పుడుకూడా అన్నితరగతులవారినీ అన్నితరహాలవారినీ రేవుదాటించి బల్లకట్టూ పైత గతికిపంపించి బడిపంతులూ తృప్తిగా నిట్టూస్తారు.

దుర్మార్గుడికి పరమ సాధువుకీ
కోటీశ్వరుడికీ కటికి దరిద్రుడికీ
విజ్ఞానికీ వివేకహీనుడికీ

ఎవరికేనాసరే సమానమైన ఆదరణే ఒకరకమైన ఆశ్రయమే లభిస్తుంది బల్లకట్టుదగ్గరా బడిపంతులు దగ్గిరాను.

పక్షపాతాలు లేవు.

పార్టీ భేదాలు లేవు.

రికమండేషన్లు లేవు.

రిజర్వేషన్లు లేవు.

కులమత భేదాలు లేవు.

హెచ్చుతగ్గులు లేవు.

పిచ్చిచేష్టలు లేవు.

నిజమైన ప్రజాస్వామ్యానికి నిగ్గయిన గీటురాళ్లలాగ నేటికీ నిలబడి ఉన్నారు. ఊరిబయట ఒకరూ ఊరిలోపల ఒకరూ (ఊరంతా మృగ్యం అయినా సరే!")

"అందుకే ఊరిబయట కాలువలో అటూ యిటూ తారట్లాడే బల్లకట్టుని చూసినప్పుడల్లా చిన్నప్పుడు నాకు పాఠం చెప్పిన మా బడిపంతులు జ్ఞాపకంవస్తారు" అంటాను నేను—

